క్లుప్తంగా

లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమయ్యపల్లి శివారులో గల కొమ్ములగట్టు లక్ష్మీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వస్తున్న ఆయనకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం చిన్నారెడ్డికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బాలచందర్, రఘు, నీలేందర నిరంజన్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పాన్‌గల్: రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాటిపై విద్యార్థులు అవగాహన కల్పించాలని పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం విజయ్ అన్నారు. శనివారం పాఠశాలలో రోడ్డు భద్రత నియమాలను వివరిస్తూ కలెక్టర్ ప్రచురించిన లేఖ ప్రతులను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను తెలుసుకొని వాటిపై గ్రామాల్లో వివరించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ గోవింద్‌నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చాకల్‌పల్లి వాసికి డాక్టరేట్



గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లికి చెందిన పోతుల కృష్ణారెడ్డి, లక్ష్మీదేవమ్మల కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించాడు. ప్రాథమిక విద్యాభ్యాసం చాకల్‌పల్లి, గోపాల్‌పేటలో పూర్తి చేసిన వెంకటేశ్వర్‌రెడ్డి.. మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో డాక్టర్ నాళేశ్వరం శంకరం పర్యవేక్షణలో 'తెలుగు సినిమా గీతాలు కర్షక జీవన చిత్రణ' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఎంఏ చదువుతున్న సమయంలోనే ఉస్మానియా ఎంట్రన్స్ పుస్తకం, యూజీసీ నెట్ ఏపీ సెట్‌కు సంబంధింపర్ టూ, పేపర్ త్రీ రెండు పుస్తకాలను ప్రాగ్మా పబ్లికేషన్‌కి రాశారు.

విద్యార్థులకు అల్పాహారం వితరణ



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం కాంగ్రెస్ నాయకులు అల్పాహారం వితరణగా అందజేశారు. కల్వరాల పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని, 10వ తరగతి విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకొని వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కాంగ్రెస్ నాయకులు చక్ర వెంకటేష్, వెంకట రాజయ్య, రమేష్‌గౌడ్, రాముడు, అఖిల్ ఆకాంక్షించారు.

గురుకుల మాదిరి పరీక్ష

ఆత్మకూర్: గురుకులంలో నిరుపేద విద్యార్థులు అర్హత సాధించేలా వారికి ఉచితంగా మాదిరి పరీక్షను నిర్వహిస్తున్నామని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జా అన్వర్‌బేగ్, మీర్జాఅక్తర్‌బేగ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23న ఐదవ తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతున్నాయని, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు 9న స్థానిక కోచింగ్ సెంటర్‌లో మాదిరి పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, వివరాలకు 94415 91776, 80198 29211 నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చసుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ల చోరీకి యత్నించిన వ్యక్తిపై ఫిర్యాదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామానికి చెందిన ఎలుక్కాయల బాలమ్మ అనే మహిళ శుక్రవారం రాత్రి నిద్రిస్తుండగా మధ్యరాత్రి ఓ వ్యక్తి సెల్‌ఫోన్లు తీసుకుని పరుగెత్తాడు. ఎలుక్కాయల బాలమ్మ దొంగను చూసి కేకలు వేయడంతో ఆమె కుమారుడు శివ లేచి పారిపోతున్న వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. రెండు సెల్‌ఫోన్లు వదిలి పారిపోయాడు. పారిపోయిన వ్యక్తి తల్పునూరు గ్రామానికి చెందిన అతడే అని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు.

కేజీబీవీల్లో ఏఎన్‌ఎంల కొరత

- 15 పాఠశాలలకు 11 మంది మాత్రమే..
- నాలుగింటిలో నేటికీ పూర్తి కాని నియామకం
- జిల్లా వ్యాప్తంగా 4,652 మంది విద్యార్థినులు



ఆత్మకూర్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఏబీవీపీ నాయకులు (ఫైల్)

అమరచింత: కేజీబీవీలలో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తూ వారు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు రోజుల నుంచి అమరచింత, ఆత్మకూర్ కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులు అస్వస్థత కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నా సంబంధిత అధికారులు ఆయా పాఠశాలలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎంల పోస్టులను మాత్రం భర్తీ చేయలేకపోతున్నారు. దీంతో చిన్నపాటి జ్వరం, జలుబు వచ్చిన తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం, వారు తమ పిల్లలను తీసుకెళ్లి ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించడం వంటి ఘటనలు తరుచూ కొనసాగుతున్నాయి. రాత్రివేళలో విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే పట్టించుకునే వారే కరువయ్యారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఇంగ్లిష్, తెలుగు మీడియం కలిపి మొత్తంగా 15 కేజీబీవీలు ఉండగా.. 4,652 మంది చదువుకుంటున్నారు. వీటిలో 11 పాఠశాలలో ఏఎన్‌ఎంలు కొనసాగుతుండగా అమరచింత, పెద్దమందడి, ఖిల్లాఘనపురం, రేవల్లి మండలాల్లోని కేజీబీవీల్లో ఏఎన్‌ఎంను భర్తీ చేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థులకు చిన్నపాటి కడుపు నొప్పి వచ్చినా బయటికి వచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకోవాల్సిన పరిస్థితులు దాపరించాయి.

ఖాళీలను భర్తీ చేయాలి



జిల్లాలోని ఆయా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఒక్కో పాఠశాలలో 250 నుంచి 300 వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. దీంతో అంతమంది విద్యార్థినులకు ఒక్క ఏఎన్‌ఎం సరైన వైద్యం అందించలేకపోతున్నారు. మరి కొన్ని పాఠశాలలో ఏఎన్‌ఎంలే లేకపోవడం బాధాకరం.

– వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

విద్యార్థినుల ఆరోగ్యం పట్టదా..



రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో, గురుకులాల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థినులు సరైన వైద్యం అందట్లేదు. అమరచింత కేజీబీవీలో 270 మంది విద్యార్థినులు ఉన్నా శోచనీయం. కనీసం ఆశావర్కర్ సైతం పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు.

– రాజేష్, ఏబీవీపీ మండల అధ్యక్షుడు

వారంలో నియమిస్తాం



జిల్లాలోని 15 కేజీబీవీల్లో కేవలం నాలుగు పాఠశాలల్లోనే ఏఎన్‌ఎం పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉంది. వీటికి సంబంధించిన రోస్టర్ ప్రక్రియ పూర్తి చేశాం. వారం రోజుల వ్యవధిలో ఏఎన్‌ఎం భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థినుల ఆరోగ్యంపై నిరంతరం దృష్టి సారిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– శుభలక్ష్మి, జీసీడీఓ

'ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి'



బుసిరెడ్డిపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు



ఖిల్లాఘనపురంలో..

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులకు పునాది లాంటిదని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్ రచించిన 'టాప్ ర్యాంకు నూరు సూత్రలు' అనే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగయ్యగౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బి.అశోక్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆయన మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం గ్రామానికి కొత్తకోట నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పాలెం బస్టాండ్ సమీపంలో ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి వివరాలు అడుగగా డ్రైవర్ షేక్ జానీ ఎలాంటి అనుమతి పత్రాలు చూపలేదన్నారు. కొత్తకోట సమీపంలోని పాత హనుమాన్ గుడి సమీపంలో వాగు నుంచి ఇసుకను తీసుకొస్తున్నట్లు చెప్పడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని అన్నారంతండా, కిష్టాపూర్‌తండా, గోప్లాపూర్ గ్రామాల్లో రెగ్యులర్‌గా వేసే వ్యాధి నిరోధక టీకాల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. గర్భిణులు సరైన సమయంలో మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్ వేయించుకునేలా సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు.

30 గ్రాముల గంజాయి పట్టివేత

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని రాజనగరం శివారులోని ఆర్‌జీ గార్డెన్ వెనుక ఆరుగురు యువకులు గంజాయి తాగుతుండగా అదుపులోకి తీసుకొని వారి నుంచి 30 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ 2 బాలయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన తిర్మల్, వనపర్తికి చెందిన లోకేష్, హేమంత్, కళ్యాన్, కృష్ణ, వంశీ రాజనగరం శివారులోని ఆర్‌జీ గార్డెన్ వెనకాల గంజాయి తాగుతున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడి చేసి వారి నుంచి 30 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను విచారించగా.. హైదరాబాద్‌లోని నానాక్‌రాంగూడ నుంచి కృష్ణ గంజాయి తీసుకొచ్చాడని ఒప్పుకున్నారు. పట్టుబడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఢిల్లీ గెలుపుపై బీజేపీ సంబురాలు



జిల్లా కేంద్రంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

వనపర్తి టౌన్: ఢిల్లీ అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ 48స్థానాలు కైవసం చేసుకుని ప్రభుత్వ ఏర్పాటు చేస్తుండడంతో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెడుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ మాట్లాడుతూ అన్నాహజారే పేరుతో నీతివంతమైన రాజకీయాలంటూ దశాబ్దం పాటు ఢిల్లీ ప్రజలను మభ్యపెట్టిన మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపారన్నారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, చిత్తారి ప్రభాకర్, రామన్‌గౌడ్, సుమిత్రమ్మ, పెద్దిరాజు, సీతారాములు, రామ్మోహన్ ఉన్నారు.

ఆత్మకూర్: స్థానిక గాంధీచౌక్, వివేకానందచౌక్‌లో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్రంలో సైతం వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, తమ్మలివిజయ్, ఆనంద్, ఎల్లన్న, అంజనేయులు, అశోక్, మనోహర్‌గౌడ్, కొండాపురంరాము తదితరులు ఉన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బీజేపీ జెండా కట్ట వద్ద బాణసంచా కాల్చి మేళతాళాల మధ్య నృత్యాలు చేస్తూ ఆనందం చాటుకుంటున్నారు. ఒకరికొకరు మిఠాయిలు పంచుతూ సంతోషాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, మేర్వరాజు, క్యామ భాస్కర్, నరాల సిద్దు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వాటర్ శ్రీనివాస్‌యాదవ్, రాకేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై మండల బీజేపీ నాయకులు అన్వేష్, రమేష్, శివరాంయాదవ్, వెంకటేష్ యాదవ్‌లో శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, జిల్లా నాయకులు విక్రం, రవినాయక్, ఆశన్న ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో నాయకులు విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలింగ్ సభ్యుడు చిట్యాల దత్తాత్రేయరెడ్డి, రాము, నరేష్ యాదవ్, కావలి అశోక్, అనిల్, మందడి నాగరాజు, గోవర్ధన, రమేష్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



పెద్దమందడిలో..

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి 420 హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి, సీఎం అయ్యాక హామీలను విస్మరించారని, వాటిని అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంలో తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు చేశామని పచ్చి అబద్ధాలు చెప్పారని ఎద్దేవా చేశారు. కానీ ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాకుండా మూడో స్థానానికి పరిమితం చేశారన్నారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'స్థానిక ఎన్నికల్లో బీసీల సత్తా చాటుదాం'



మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

కొత్తకోట రూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు సత్తా చాటాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అన్ని జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను బరిలో దించుతామని, బీసీ పొలిటికల్ జేఏసీ తరఫున వారికి సహాయ సహకారాలు అందించడంతో పాటు వారిని గెలిపించుకునే బాధ్యత కూడా తీసుకుంటామన్నారు. బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, కచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మకంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రమేష్‌సాగర్, మ్యాదరి రాజు, కురువ నరసింహ, బోయ చెంద్రాయుడు, కుమ్మరి రాజు, చాకలి సాయులు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

'ఓటీఎస్'ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సీఈఓకు నగదును అందజేస్తున్న రైతు

పాన్‌గల్: ప్రాథమిక సహకార సంఘం ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకొని అపరాధ వడ్డీమాఫీని పొందాలని సీఈఓ భాస్కర్‌గౌడ్ రైతులకు సూచించారు. శనివారం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక సహకార సంఘం పరిధిలో దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు దాదాపుగా 392 మంది ఉన్నారని, వారి ద్వారా రూ.3 కోట్ల అప్పులు బ్యాంకుకు రావాల్సి ఉందన్నారు. ఓటీఎస్ గడువు ఈనెల 15వ తేదీ వరకు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 10 శాతం మంది రైతులకు అపరాధ వడ్డీ ద్వారా రూ.21.70 లక్షల వరకు మాఫీ కాగా.. వారు కేవలం రూ.9.25 లక్షలు మాత్రమే చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ



అమ్మవారికి కలశాలను సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొత్తకోట: పట్టణంలో కొలువై ఉన్న శక్తి స్వరూపిణి అంబభవాని శంకర ఆలయంలో నేటి నుంచి 10వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభ ఏర్పాటు కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన శిఖరంపై ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన కలశాలను స్థానిక రాఘవేంద్రస్వామి ఆలయం నుంచి భవానీశంకర ఆలయం వరకు మేళతాళాలు, బాజా భజంత్రీలు, కోలాటాలు, పలకల భజనలు, సంప్రదాయబద్ధంగా భజనలు చేస్తూ శోభయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో శాస్త్ర ప్రకారం శ్రీశైలం మఠం సారంగదర కోటేశ్వర స్వామివారు, ఆలయ అర్చకులు మఠం సదాశివుడు, మఠం ఆనందయ్య నూతన కలశాలకు, నవగ్రహాలకు, ధ్వజస్తంభానికి జలధివాసం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభయాత్రలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు పొగాకు మహేష్ బాబు సోదరులు ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, పొగాకు అనిల్‌కుమార్, బల్లే శ్రీధర్, సీడీసీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీసం చెన్నకేశవరెడ్డి, పొగాకు విశ్వేశ్వర్, నర్సింహశెట్టి, మేస్త్రీ శ్రీనివాసులు, గుంత మౌనిక, నాగరాజు, బాబురెడ్డి, బీమా కిషోర్‌కుమార్, అమృతరెడ్డి, నవీన్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 13 నుంచి చేపట్టనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ప్రధాన రోడ్డు నుంచి ఆలయం వరకు ఎమ్మెల్యే నిధులు రూ.60లక్షల వ్యయంతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఇటీవలే దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌జే బోయేజ్, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, రామ్మోహన్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వనపర్తి కృష్ణారెడ్డి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాగ్రశ్రవణం, రక్షకబంధనం, వాస్తు మండపం, సర్వతోభద్ర మండల ఆరాధన, ప్రతిష్ఠాపన, ధాన్యదివాసం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారులు శరత్‌చంద్రశర్మ, పవన్ కుమార్, శ్రావణ్‌కుమార్, సంతోష్, భరత్‌ద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో గంగమ్మ ఉత్సవాలు



పెంట్లవెల్లి నూతన ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నూతన గంగమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా శనివారం మహాగణపతి ప్రతిష్ఠ సందర్భంగా గణపతి పూజ, హోమం, అవాహిత సర్వదేవత మండపారాదనం, జలదివాసం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు జంటలు ఘనంగా హోమం నిర్వహించారు. 10న నవగ్రహ, గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గంగమ్మ ఆలయ కమిటీ, దేవాలయ కమిటీ, అర్చకులు శివయ్యశర్మ తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రజలు పాల్గొనాలని ఆలయ కమిటీ పెద్దలు కోరారు. కార్యక్రమంలో కుమార్, రేణు, లక్ష్మీనారాయణ, ఇంద్ర, గంగన్న, రామకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.